క్లుప్తంగా

ఎర్నిమాంబ ఆలయంలో ప్రత్యేక దర్శనాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఫాల్గుణ మాసం ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఆలయ కమిటీ నేతృత్వంలో పూజారి ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలు ఏర్పాటు చేశారు. భక్తులు వంటావార్పు చేసుకుని మొక్కులు తీర్చుకున్నారు.

నేడు, రేపు జగద్గురు పీఠం ప్రత్యేక కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం: ది వరల్డ్ టీచర్ ట్రస్ట్(జగద్గురు పీఠం)లో వ్యవస్థాపకుడు మాస్టర్ ఈకే 39వ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 6, 7 తేదీల్లో ప్రత్యేక కార్యక్రమాలు, పూజలు నిర్వహించనున్నట్లు సంస్థ డైరెక్టర్ చింతలపాటి సత్యదేవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం సాయంత్రం సాగరతీరంలోని మాస్టర్ ఈకే సుందరవనంలో సామూహిక ప్రార్థనలు, రుద్రాభిషేకం, పూర్ణిమాధ్యానాదులను జగద్గురు పీఠం సోదర బృందం నిర్వహిస్తుందని పేర్కొన్నారు. మంగళవారం తాటిచెట్లపాలెంలోని మాస్టర్ ఈకే సంస్కృతి సదన్‌లో పేద మహిళలకు కుట్టు మిషన్లను జగద్గురు పీఠం గౌరవాధ్యక్షుడు డాక్టర్ కె.ఎస్.శాస్త్రి బహూకరిస్తారన్నారు. వృత్తి విద్యల్లో శిక్షణ పొందిన మహిళలకు ధ్రువపత్రాలను ఈ కార్యక్రమంలో అందజేయనున్నట్లు సత్యదేవ్ చెప్పారు.

గౌర పూర్ణిమ ఉత్సవం రేపు

ఎంవీపీ కాలనీ: ఈ నెల 7న ఎంవీపీ కాలనీలోని ఏఎస్ రాజా మైదానంలో గౌర పూర్ణిమ ఉత్సవాన్ని నిర్వహించనున్నట్లు హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణ భగవానుడి అవతారమైన శ్రీకృష్ణ చైతన్య మహాప్రభు ఆవిర్భవించిన సందర్భంగా ఈ ఉత్సవం జరగనుంది. శ్రీకృష్ణబలరాముల విగ్రహాలకు అభిషేకం, మహా మంగళహారతి, పుష్ప వృష్టి, పల్లకీ ఉత్సవాలు నిర్వహించనున్నారు.

పీఆర్‌టీయూ సమావేశం

తాటిచెట్లపాలెం: సుబ్బలక్ష్మీనగర్‌లోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో ఆదివారం ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) విద్యా సదస్సు జరిగింది. ఈ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఎస్‌ఎస్‌ఏలో పనిచేస్తున్న అన్ని వర్గాల వారికి ఎంటీఎస్ అమలు చేయాలని, డిగ్రీ, జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లకు 12 నెలల ఎంటీఎస్ అమలు చేయాలని వీరు కోరారు. 2003కు ముందు నియామకమైన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలని ఈ సదస్సులో తీర్మానించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా కృష్ణయ్య, బైరి అప్పారావు, డి గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మహత్ కాలనీలో అన్నదానం



అన్నదానం చేస్తున్న రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు మహత్ కాలనీలో గ్రామ అమ్మవారి పండగ సందర్భంగా ఆదివారం జీవీఎంసీ శానిటరీ వర్కర్ ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ముఖ్య అతిథి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అన్న సంతర్పణకు కావాల్సిన మూడు బస్తాల బియ్యం, వంటనూనె ఒక టిన్‌ను ఆయన విరాళంగా ఇచ్చారు.

చేతల్లో ఆదర్శం

- ఆధునికంగా మురళీనగర్ వాకర్స్ పార్కు
- సకల సౌకర్యాలు కల్పిస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు
- దాతల సహకారంతో అభివృద్ధి



మురళీనగర్ వాకర్స్ పార్కు నూతన ముఖద్వారం



పార్కులో ఆధునికీకరించిన సభా వేదిక

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కు అభివృద్ధికి ముందు చూపుతో వాకర్స్ క్లబ్ సభ్యులు నిర్వహిస్తున్న కార్యక్రమాలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. పార్కులో ఇప్పటికే ఉన్న సౌకర్యాలకు అదనంగా మరిన్ని నూతన సదుపాయాలు కల్పిస్తున్నారు. ఇందు కోసం దాతల సహకారం తీసుకుంటూ పార్కును సుందరంగా తీర్చిదిద్దారు.

ఆకర్షణీయంగా ప్రవేశ ద్వారం

గతంలో ఉన్న పార్కు పాత ముఖద్వారానికి బదులుగా లేటెస్ట్ డిజైన్‌తో ప్రవేశ ద్వారాన్ని నిర్మించారు. కార్పొరేట్ పార్కు మాదిరిగా రూపుదిద్దుకున్న ఇది సందర్శకులను ఆకట్టుకుంటుంది. శ్రీచక్ర వెంచర్స్ అధినేత గద్దె చక్రధర్, పద్మశ్రీ దంపతులు అందించిన రూ.5 లక్షల ఆర్థిక సహకారంతో సాలిడ్ స్టీల్‌తో గేటు నిర్మించారు. పార్కు నామఫలకానికి సుమారు లక్ష రూపాయలు ఖర్చు చేశారు. దీన్ని ఇటీవల ప్రారంభించారు. చక్రధర్, పద్మశ్రీ దంపతులు గతంలో పార్కు అభివృద్ధికి, పచ్చదనం పునరుద్ధరణకు సహకరించారు.

క్లబ్ నిధులు, విరాళాలతో..

- వాకర్స్ పార్కులో పురుషులకు మాత్రమే టాయిలెట్ ఉండేది. ఇక్కడికి వాకింగ్‌కు వచ్చే మహిళలు ప్రత్యేక మరుగుదొడ్డి లేక ఇబ్బంది పడేవారు. క్లబ్ నిర్వాహకుల అభ్యర్థనల మేరకు జాలీ వాకర్ నానుపాత్రుని ప్రకాశరావు సౌచాలయం నిర్మాణానికి రూ.35 వేలు విరాళంగా అందించారు. దీంతో మహిళలకు టాయిలెట్ అందుబాటులోకి వచ్చింది.
- సభా వేదిక పైకప్పు పాడవడంతో దీన్ని ఇటీవల పునర్నిర్మించారు. ఇందుకు అవసరమైన రూ.70 వేల నిధులను వాకర్స్ క్లబ్ పూర్వాధ్యక్షుడు చిలకమర్తి కృష్ణమూర్తి అందించారు. హుద్‌హుద్ తుపాను సమయంలో పార్కులో పాడైన విద్యుత్ లైట్ల స్థానంలో ఆయన కొత్తవి ఏర్పాటు చేయించారు. బోరు, ఫౌంటెయిన్ నిర్మాణానికి తన సొంత నిధులను ఖర్చు చేశారు.
- క్లబ్ సాధారణ నిధులతో వెయ్యి లీటర్ల నిల్వ సామర్థ్యం గల వాటర్ ట్యాంకును ఏర్పాటు చేశారు. కుళాయిలను మార్చారు.
- గత జనవరిలో ఆపేసిన మున్సిపల్ కుళాయిని జీవీఎంసీ ప్రాజెక్టు ఈఈ సహకారంతో 24 గంటలు తాగునీటి సరఫరాను పునరుద్ధరించారు. వాకర్స్ కోసం మినరల్ వాటర్‌ను అందిస్తున్నారు.
- పార్కు రక్షణ కోసం 12 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. వాటి కోసం రూ.69 వేలను వాకర్ రామానుజ సుధీర్ అందించారు.



పార్కులో మహాత్మా గాంధీ విగ్రహం

- మహాత్మా గాంధీ విగ్రహం, ప్రాంగణ అభివృద్ధికి రూ.1 లక్ష 20 వేల నిధులను వాకర్స్ పార్కు అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి సమకూర్చారు. బుద్ధుడి ముఖ మండపానికి రూ.40 వేలు ఆయన సమకూర్చారు. ఇలా అందరి సహకారంతో వాకర్స్ పార్కు అభివృద్ధిలో దూసుకుపోతోంది.

త్వరలో ఆర్వో ప్లాంట్



పార్కులో పూర్తి స్థాయిలో వాకర్స్, సందర్శకులకు మినరల్ వాటర్ సదుపాయం కోసం త్వరలో దాతల సాయంతో ఆర్వో ప్రాజెక్టు ఏర్పాటు చేస్తాం. క్లబ్ సభ్యులు, పూర్వాధ్యక్షుల సహకారంతో పార్కును సుందరంగా తీర్చిదిద్దుతున్నాం. వాకింగ్ ట్రాక్‌ను ఆధునికీకరించనున్నాం. దీనికి రూ.4 లక్షల నిధులు అవసరమవుతాయని అంచనా రూపొందించాం. ఇందుకోసం జీవీఎంసీ అధికారులకు వినతిపత్రం అందించాం.

– పల్లా చంద్రమౌళి, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు

సీతంరాజు విజయానికి క్షేత్రస్థాయిలో కృషి

- ఎంపీ ఎంవీవీ, వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' సమన్వయకర్త కె.కె.రాజు
- సందడిగా ఆత్మీయ సమావేశం



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు

మర్రిపాలెం: ఈ నెల 13న జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయానికి ప్రతి ఒక్కరూ క్షేత్రస్థాయిలో పనిచేయాలని నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో ఆదివారం ఉత్తర నియోజకవర్గం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. విశిష్ట అతిథిగా విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, ముఖ్య అతిథులుగా పార్టీ ఉత్తర నియోజకవర్గ పరిశీలకుడు చిక్కాల రామారావు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ పట్టభద్రుల ఎన్నికల్లో సీతంరాజు సుధాకర్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎమ్మెల్సీ స్థానాన్ని బహుమతిగా ఇవ్వాలన్నారు. కె.కె.రాజు మాట్లాడుతూ పట్టభద్రులందరూ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజును గెలిపించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి వార్డులో కార్పొరేటర్లు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేస్తున్నారని అభినందించారు. సీఎం వైఎస్ జగన్ చెప్పిన ప్రతి మాట అమలు చేస్తున్నారని ప్రశంసించారు.

ఆత్మీయ సమావేశంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు సారిపిల్లి గోవింద్, బర్కత్ అలీ, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి శ్రీనివాస్, పి.ఉషశ్రీ, కె.కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజని ఈశ్వరరావు, కె.వి.ఎన్.శశికళ, కో ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, మాజీ కార్పొరేటర్లు జి.వి.రమణి, బాక్సర్ రాజు, కె.వెంగళరావు, బులుసు జగదీష్, పోతు సత్యనారాయణ, పార్టీ వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, పైడి రమణ, గుజ్జు వెంకటరెడ్డి, షేక్ జుబేర్, కె.పి.రత్నాకర్, దుప్పలపూడి శ్రీనివాస్, రాష్ట్ర యాత కార్పొరేషన్ చైర్‌పర్సన్ పిల్లి సుజాత, సీనియర్ నాయకులు మహమ్మద్ ఫారూఖీ, కిరణ్‌రాజు, పేడాడ రమణికుమారి, దేముడుబాబు మాస్టర్, కృష్ణారావు మాస్టర్, బి.రాధ, డైరెక్టర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యులు, సచివాలయం కన్వీనర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీతంరాజుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం



శాంతినగర్‌లో పట్టభద్రులకు కరపత్రాలు అందిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: నియోజకవర్గంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం ముమ్మరంగా సాగుతోంది. వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని కోరుతూ ఆదివారం 46వ వార్డు కంచరపాలెం, తాటిచెట్లపాలెం కొండవాలు ప్రాంతాల్లో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. పట్టభద్రులను కలిసి ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటు వేయాలని ఆయన అభ్యర్థించారు. పార్టీ నాయకులతో కలిసి కరపత్రాలు పంచారు.

మంచిగా జీవించండి



ఫోర్త్ టౌన్ పీఎస్ ఆవరణలో రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ చేస్తున్న సీఐ శ్రీనివాసరావు



రౌడీ షీటర్లకు సూచనలిస్తున్న ద్వారకా జోన్ సీఐ సింహాద్రినాయుడు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీ షీటర్లు, పాత నేరస్తులకు సీఐ శ్రీనివాసరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల జోలికి పోకుండా సత్ప్రవర్తనతో నడుచుకోవాలని సూచించారు. ఎటువంటి అల్లర్లు చేయకుండా ఉండాలని హెచ్చరించారు. ఎటువంటి తగాదాల్లో తలదూర్చినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతానికి స్వస్తి పలికి కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా జీవించాలని, సమాజంలో మంచిగా నడుచుకోవాలని హితవు పలికారు. పోలీస్ నిఘా ఎల్లప్పుడూ ఉంటుందని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ధర్మేంద్ర, ప్రమీల, వెంకటరావు, మోహన్‌రావు, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

ద్వారకా పీఎస్‌లో..

ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్‌లో రౌడీ షీటర్లకు సీఐ సింహాద్రినాయుడు, ఎస్‌ఐ ధర్మేంద్ర కౌన్సెలింగ్ చేశారు. తగాదాల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి మంచిగా జీవించాలని సూచించారు. రౌడీ షీటర్ల దినచర్యపై ఆరా తీశారు. అల్లరు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

8న దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట

కంచరపాలెం: స్థానిక గొల్లకంచరపాలెం శ్రీరామా సేవా సమాజం(యాదవ్) గ్రామాధ్యక్షుడు పల్లా సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈ నెల 8న దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం నిర్వహించనున్నట్లు సమాజం ప్రతినిధులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించి వారు మాట్లాడారు. శ్రీమాన్ రేజేటి శ్రీరామాచార్యులు సంపూర్ణ పర్యవేక్షణలో కోదండ సీతారామ, సంపత్ వేంకటేశ్వర స్వామి, ధనలక్ష్మి దేవి విగ్రహాలను ప్రతిష్ఠించనున్నామని చెప్పారు. ఈ నెల 11న శనివారం ఉదయం 10 గంటలకు సీతారాములు, సంపత్ వేంకటేశ్వర స్వామి కల్యాణం వేడుకలు ఒకే వేదికపై నిర్వహించనున్నామని పేర్కొన్నారు. అనంతరం భారీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. స్థానికులు భక్తులు పాల్గొనాలని పల్లా సత్యనారాయణ కోరారు.

ముగిసిన నీలమ్మ జాతర

అల్లిపురం: అస్సాం గార్డెన్స్‌లో వెలసిన నీలమ్మ వేప చెట్టు అమ్మవారి వార్షిక జాతర మహోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో అర్చకుడు జోగారావు శర్మ అమ్మవారికి పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్నసమారాధనను వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్రోణంరాజు శ్రీవత్సవ్ ముఖ్య అతిథిగా ప్రారంభించారు.

జీవో 24 అమలులో చిత్తశుద్ధి అవసరం



మాట్లాడుతున్న వీసీ సత్యనారాయణ

సీతంపేట: ప్రైవేట్, ఎయిడెడ్ స్కూళ్లలో ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశం కోసం పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు కేటాయించాలని ప్రభుత్వం విడుదల చేసిన జీవో నంబర్ 24పై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. జీవో 24పై స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో బాలవికాస్ ఫౌండేషన్, రైట్ టు ఎడ్యుకేషన్ ఫోరం సంయుక్తంగా ఆదివారం బీవీకే కళాశాలలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దామోదర సంజీవయ్య లా యూనివర్సిటీ వ్యవస్థాపక వీసీ వై.సత్యనారాయణ మాట్లాడుతూ జీవో నంబర్ 24 అమలులో చిత్తశుద్ధి అవసరమన్నారు. విద్యా హక్కు చట్టం అమలులో ప్రభుత్వంతోపాటు టీచర్లు తమ వంతు పాత్ర పోషించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో హాజరు తక్కువై డ్రాప్ అవుట్స్ ఉన్న నేపథ్యంలో ఈ అంశంపై కూడా దృష్టి సారించాలని కోరారు. జీవో అమలులో లోపాలను స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వం దృష్టికి తేవాలన్నారు. సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు మాట్లాడుతూ విద్యా హక్కు చట్టం అమలు చేయడంలో ప్రభుత్వం చురుగ్గా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా కానుక వంటి పథకాలు అందులో భాగమేనన్నారు. పూర్తి స్థాయిలో చట్టాన్ని అమలు చేయాలని కోరారు. సమావేశంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గౌరీ శంకర్, అబ్దుల్ బేగ్, నరసింహారావు, హరగోపాల్, మధుసూదనరావు పాల్గొన్నారు.

గీతాభవన్‌లో నక్షత్రమాల పూజలు



కృష్ణ భగవానుడికి పూజలు చేస్తున్న అతిథులు

డాబాగార్డెన్స్: గీతా ప్రచార సమితిని ప్రారంభించి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లోక కల్యాణార్థం నక్షత్రమాల పేరిట 27 నక్షత్రాలకు.. 27 సార్లు భక్తులందరిచే సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణ నిర్వహించారు. ముందుగా గీతా మందిరంలో వేంచేసిన విశ్వరూప సహిత శ్రీకృష్ణార్జున ప్రతిష్ట మూర్తులకు, గోసహిత శ్రీకృష్ణ భగవానుని ఉత్సవమూర్తికి ప్రత్యేక పూజలు జరిపారు. ఆధ్యాత్మిక ఉత్సవంలో పాల్గొన్న బ్రహ్మశ్రీ మురళీకృష్ణ భక్తులనుద్దేశించి ప్రసంగిస్తూ శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం వల్ల విశ్వశాంతి కలగడమే గాక పాల్గొన్న వారందరికీ శుభాలు కలుగుతాయని అభిలషించారు. గీతా ప్రచార సమితి గత 50 ఏళ్లుగా నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక ఉత్సవాలను ఆయన ప్రశంసించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ప్రచార సమితి గౌరవ అధ్యక్షుడు వై. కృష్ణమూర్తి, అధ్యక్షుడు సీహెచ్ విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జగన్‌మోహన్‌రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఎంవీ రాజశేఖర్, కార్యదర్శి ఎం. వనజాదేవి, జీవీఆర్ ప్రసాద్, లక్ష్మీనరసింహం తదితరులు పాల్గొన్నారు.

కళాకారుల వైద్య శిబిరం విజయవంతం



శిబిరంలో కళాకారులకు సేవలందిస్తున్న వైద్యుల బృందం

డాబాగార్డెన్స్: విశాఖ స్మార్ట్‌సిటీ లయన్స్ క్లబ్, విశాఖ సంగీత కళాకారుల సంక్షేమ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో డాబాగార్డెన్స్ అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కళాకారుల మెగా వైద్య శిబిరం విజయవంతమైంది. సుమారు 300 మంది కళాకారులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. నగరానికి చెందిన ప్రముఖ వైద్యుల పర్యవేక్షణలో షుగర్, బీపీ పరీక్షలతో పాటు దంత పరీక్షలు, కంటి పరీక్షలు నిర్వహించారు. జనరల్ ఫిజీషియన్స్ డాక్టర్ కృష్ణ హారిక, సాయి లక్ష్మి, కృష్ణకీర్తి, ఉమా ప్రవల్లిక పాల్గొని అవసరమైన పరీక్షలు చేసి మందులు, కళ్లజోళ్లు అందజేశారు. అనంతరం క్యాన్సర్ వైద్య నిపుణురాలు డాక్టర్ శ్రీప్రభ ఆ వ్యాధిపై అవగాహన కల్పించారు. ముందుగా స్మార్ట్‌సిటీ అధ్యక్షుడు ఎం. త్రినాథరావు, లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఉషారాజు శిబిరాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జోనల్ చైర్‌పర్సన్ రోహిణిరాజు, క్యాబినెట్ సెక్రటరీ యు. జానకీదేవి, కోశాధికారి ఐఎస్‌ఎన్ రాజు, ఎం. విజయలక్ష్మి, ఎం. గోపాల్, కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు కొణతాల రాజు, అధ్యక్షుడు మహ్మద్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి చెన్నా తిరుమలరావు, మెలోడి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రోక్తంగా బ్రహ్మోత్సవాలు

కూర్మన్నపాలెం : జీవీఎంసీ 86వ వార్డు పరిధి సైమాన్‌నగర్‌లోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఆదివారం శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. ఆలయ ధర్మకర్త, వైఎస్సార్‌టీయూసీ అధ్యక్షులు పున్నూర్ గౌతంరెడ్డి దంపతులు ఆధ్వర్యంలో 5 రోజులు పాటు స్వామి వారి బ్రహ్మోత్సవాలను నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. ఆలయ పండితులు వేద మంత్రోచ్ఛరణల మధ్య ఎమ్మెల్యే నాగిరెడ్డిని సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించారు. ఈ బ్రహ్మోత్సవాలకు విజయవాడ నుంచి చిన్న జీయర్ స్వామి శిష్య బృందం విచ్చేసింది.

భక్తుల కొంగుబంగారం పైడితల్లమ్మ

- నేడు అమ్మవారి తొలేళ్ల సంబరం
- రేపు ప్రధాన జాతర
- ఉత్సవ కమిటీ ఏర్పాట్లు



పైడితల్లి అమ్మవారి నిజరూపం



పైడిమాంబ పుట్టబంగారం చెట్టు ఆలయం వద్ద అమ్మవారిని దర్శించుకుంటున్న భవానీ భక్తులు

కంచరపాలెం: కోరిన వరాలిచ్చే కల్పవల్లిగా.. సంతానలక్ష్మిగా.. భక్తుల పాలిట కొంగుబంగారంగా కంచరపాలెం ఆర్పీ పేట రైల్వే గేటు వద్ద కొలువైన పైడిమాంబ అమ్మవారు విరాజిల్లుతున్నారు. 80 ఏళ్లుగా అమ్మవారి చల్లని దీవెన కోసం వేలాది మంది భక్తులు ఇక్కడి తరలివస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ నెల 6వ తేదీ సోమవారం పైడిమాంబ అమ్మవారి తొలేళ్ల సంబరం, 7వ తేదీ మంగళవారం ప్రధాన జాతర నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాటు పూర్తి చేసినట్లు ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు ఆదివారం తెలిపారు. ఈ నెల 14న మారువారం పండగతో ఉత్సవాలు ముగుస్తాయని చెప్పారు. ఈ సందర్భంగా పైడిమాంబ అమ్మవారి పుట్టబంగారం చెట్టు ఆలయం వద్ద ఆదివారం పెద్ద ఎత్తున భవానీ భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఆలయ చరిత్ర..

కంచరపాలెం ప్రజలు తమ ఇలవేల్పుగా.. గ్రామదేవతగా పైడిమాంబ అమ్మవారిని కొలుస్తారు. భక్తిశ్రద్ధలతో పూజిస్తే కోరికలు నెరవేరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. ఇక్కడున్న పూర్వీకులు వ్యాపారాల నిమిత్తం తగరపువలసలో వెలసిన పోలిపిల్లి పైడిమాంబ జాతరకు ఈ గ్రామం నుంచి ఎడ్లబళ్లపై వెళ్లి దర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో భీమరశెట్టి గంగన్న అనే వ్యక్తి బండిని మార్గం మధ్యలో ఓ స్త్రీమూర్తి ఆపి ఎక్కికూర్చుంది. ఆమె విశ్వరూపం చూసిన ఆ వ్యక్తి మూర్ఛతో పడిపోయాడు. ఆ ఎడ్లబళ్లు ఇక్కడికి చేరుకోవడంతో గంగన్న బండిలో దేవతామూర్తి విగ్రహం ప్రత్యక్షమైంది. దీంతో ఊరి చివరన వేపచెట్టు కింద విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. కంచరపాలెం-రామ్మూర్తిపంతులుపేట ప్రజల కష్టాలు తీర్చేందుకు పైడిమాంబ అమ్మవారు 130 ఏళ్ల కిందట ఈ ప్రాంతంలో ఓ చెట్టు కింద వెలిశారు. అప్పటిలో ఈ ప్రదేశమంతా సున్నపు బట్టీలతో అడవిలా ఉండేదని గ్రామ పెద్దలు చెబుతుంటారు. ఈ విగ్రహానికి మొదట్లో పూజలు జరగలేదు. దాని ఫలితంగా రామ్మూర్తిపంతులుపేట చుట్టూ ఉన్న ప్రాంతాల్లోని ప్రజలు కలరా, మశూచి, ఆటలమ్మ వంటి అంటువ్యాధులతో అల్లాడేవారని భావించారు. అప్పటి నుంచి అమ్మవారు నిత్య పూజలందుకుంటోంది. ఆలయం నిర్మించాక 80 ఏళ్లుగా ప్రతి మంగళవారం అన్నదానం, ఏటా మార్చిలో తొలేళ్ల సంబరం, ప్రధాన జాతర, ఘనంగా నవరాత్రి ఉత్సవాలు, ఆఖరు రోజున భారీ అన్నసంతర్పణ వంటి విశేష కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తున్నారు.

నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి స్ఫూర్తి



752వ రోజు ఉక్కు దీక్షలో కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతున్న మస్తానప్ప

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు అనే నినాదంతో జరిగిన నాటి ఉక్కు ఉద్యమం నేటి తరానికి ఉద్యమ స్ఫూర్తి అని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు వై.మస్తానప్ప అన్నారు. ఈ మేరకు 752వ రోజు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలో వైఎస్సార్‌టీయూసీ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చొని ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వై.మస్తానప్ప కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు సాగించిన పోరాట ఫలితంగా మోడీ ప్రభుత్వం మూడు వ్యవసాయ చట్టాలను వెనక్కి తీసుకుందని, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు అటువంటి పోరాటాలు చేయక తప్పదన్నారు. ఉక్కు నిర్వాసితులు చేసిన ప్రాణత్యాగాలను మోడీ ప్రభుత్వం గుర్తు చేసుకోవాలనాన్నరు. కార్యక్రమంలో వైఎస్సార్‌టీయూసీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.